క్లుప్తంగా

నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



పర్సును బాధితుడికి అందజేస్తున్న ఆర్టీసీ కంట్రోలర్ శంకరయ్య

నాయుడుపేట టౌన్ : ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న పర్సును బాధితుడికి అప్పగించి కండక్టర్ నిజాయితీని చాటుకున్నారు. ఈ సంఘటన నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయగిరి నుంచి తిరుపతికి వెళుతోంది. ఈ బస్సులో నాయుడుపేట పట్టణానికి చెందిన ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత మేనేజర్ దారా కోటయ్య నెల్లూరులో ఎక్కి నాయుడుపేటలో దిగిపోయారు. అతని పర్సును బస్సులో జారవిడుచుకున్నారు. పర్సును కండక్టర్ ఆర్.సూర్యనారాయణ గుర్తించారు. అందులో రూ.6,500 వరకు నగదు, పలు డెబిట్, క్రెడిట్ కార్డులు ఉన్నాయి. అందులో ఉన్న ఫోన్ నంబరుకు కాల్ చేశారు. ఆ పర్సును తిరుపతి నుంచి తిరిగి వచ్చి నాయుడుపేట ఆర్టీసీ కంట్రోలర్ కోటూరు శంకరయ్యకు అప్పగించారు. బ్యాంక్ విశ్రాంత మేనేజర్ కోటయ్య స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చి కంట్రోలర్ నుంచి పర్సు తీసుకుని కండక్టర్ సూర్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు దుప్పట్లు, చీరల పంపిణీ



వరద బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేసిన నాయకులు

నాయుడుపేట టౌన్ : విజయవాడలో వరద బాధితులకు ఆదివారం నాయుడుపేటకు చెందిన టీడీపీ నేతలు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. చిందేటి సుజాతమ్మ, మాజీ ఎంపీపీ తుపాకుల కన్నెమ్మ, దార్ల రాజేంద్ర, మహిళ మండ అధ్యక్షురాలు సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో టాటా ఏస్ వాహనం బోల్తా



రాపూరు: రాపూరు–చిట్వేలి ఘాట్ రోడ్డులో ఆదివారం అదుపు తప్పి టాటా ఏస్ వాహనం బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. టాటా ఏస్ వాహనం నిమ్మ మొక్కలను తీసుకుని రైల్వే కోడూరు నుంచి పొదలకూరు వెళుతోంది. రాపూరు సమీపంలో ఘాట్ రోడ్డులో అదుపుతప్పి బొల్తాపడింది. డ్రైవర్ సుబ్రమణ్యంకు స్వల్పగాయాలయ్యాయి. నిమ్మ మొక్కలు రోడ్డుపై పడిపోయాయి. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై కోట క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం లారీ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. లారీ కూరగాయల లోడుతో కోయంబత్తూరు నుంచి కాకినాడకు బయలుదేరింది. కోట క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ వీరాస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని అంబులెన్స్‌లో గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేనాడు దర్గా గంధోత్సవానికి భారీ బందోబస్తు

తడ: వేనాడులో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న షేక్ దావూద్ షావలీ అల్లా దర్గా 29వ గంధోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఇక్కడికి రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, ఈ క్రమంలో ముగ్గురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, వంద మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంగళవారం ఉదయం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు అటకానితిప్ప రోడ్డు నుంచి దర్గా వరకు అన్ని ప్రధాన ప్రాంతాల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు.



వెంకటగిరి రూరల్: వెంకటగిరి కోర్టు సెంటర్ వద్ద కొలువైన ప్రమిదల వినాయకుడు



వెంకటగిరి రూరల్ : ఆంధ్రాబ్యాంకు వద్ద కొలువుదీరిన అయోధ్య వినాయకస్వామి



చిల్లకూరులోని వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గూడూరు రూరల్ : అడవిలో వినాయకునికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, గ్రామస్తులు

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్య

వినాయక చవితి వేడుకలను శనివారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్ల వద్ద బుజ్జి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. నాయుడుపేట పట్టణంలోని దర్గా వీధిలో ఎస్‌జే రాజేష్ ఆధ్వర్యంలో ర్పాటు చేసిన 22 అడుగుల భారీ వినాయకుని విగ్రహం వద్ద నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల ఉట్టిమాను ఏర్పాటుచేసి ఉట్టికొట్టే ఉత్సవాలు చేపట్టారు. అలాగే విజయగణపతి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఆదివారం రాత్రి వినాయకుని ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి నగరోత్సవం నిర్వహించారు.

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా వినాయకుడి విగ్రహాల ప్రతిష్ట
- చిన్నాపెద్దా లేకుండా విశేష పూజలు



నాయుడుపేట టౌన్ : పెద్ద దర్గా వద్ద వినాయకుడికి పూజలు చేస్తున్న నేతలు



వెంకటగిరి పెద్ద శివాలయం వద్ద కొలువుదీరిన ఆయుర్వేద వినాయకుడు

నాయుడుపేట టౌన్/సైదాపురం/కోట/రాపూరు/దక్కిలి/వెంకటగిరి రూరల్/సూళ్లూరుపేట/పెళ్లకూరు/చిల్లకూరు/గూడూరు రూరల్ :

■ సైదాపురం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వినాయకుని చవితిని ఘనంగా జరుపుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. విగ్రహాల వద్ద ఉట్టికొట్టే ఉత్సవాలు నిర్వహించారు. తురిమెర్ల, ఊటుకూరు, కలిచేడు, మర్లపూడి, చాగణం, గిద్దలూరు, తలుపూరు, అనంతమడుగు, చీకవోలు, అన్నంరాజుపల్లి, ఆర్‌వైజీపాళెం, లింగనపాళెం, కేజీఆర్‌పాళెంలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేశారు.

■ కోట మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని శనివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కోట, కోటక్రాస్ రోడ్డు, విద్యానగర్ ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు ఆకట్టుకున్నాయి. చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ శ్రీనివాసనత్రం సాగర తీరాన సైకత గణేషుడిని రూపొందించాడు.

■ రాపూరులోని కొత్తపేట, శివాలయం, సిద్ధలయ్య సెంటర్‌తోపాటు పలు గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటుచేశారు. కొత్తపేట సెంటర్‌లో ఆదివారం అన్నదానం చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

■ దక్కిలి మండలంలో వాడవాడలా వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలుగ్రామాల్లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కోలాటం, పండరి భజనలు నిర్వహించారు.

■ వెంకటగిరి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లతోపాటు వీధుల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటుచేశారు. పెద్దశివాలయం సమీపంలో ఆయుర్వేద వైద్య వినాయకుడిని తీర్చిదిద్దారు. కోర్టు సెంటర్‌లో ప్రమిదలతో వినాయకుడిని కొలువు దీర్చారు. ఆంధ్రా బ్యాంకు సమీపంలో ఆయోధ్యలో వినాయకస్వామి ఆర్ట్‌ను తయారు చేశారు. పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. కొంతమంది ఆదివారం సాయంత్రం వినాయకుడి విగ్రహాలను తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు.

■ సూళ్లూరుపేట పట్టణంలో వినాయక చవితి పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. బాపూజీ వీధికి చెందిన వ్యాపారులు మొక్కజొన్న కంకులతో గణనాథుడిని తయారుచేయించారు. పీర్లచావిడి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం పాండురంగయాదవ్, అలవల సురేష్ ఆధ్వర్యంలో అత్యంత సుందరంగా వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. షార్ బస్టాండ్ సెంటర్‌లో జై గణేష్ ఉత్సవ కమిటీ అధ్వర్యంలో వినాయకుడి మందిరాన్ని అందంగా తీర్చిదిద్ది పెద్ద గణపయ్యను ఏర్పాటు చేశారు. బాపూజీకాలనీ, సాయినగర్, పరమేశ్వరి నగర్, కనకదుర్గా థియేటర్ సెంటర్, మనోహర్ థియేటర్ సెంటర్, కోళ్లమిట్ట, ఇందిరానగర్, మహదేవయ్యనగర్, కావలివీధి, కాపువీధి, నాగరాజుపురం, కేఆర్‌పీ కాలనీ, ఇసుకమిట్ట, డీఆర్‌డీఎల్‌కాలనీ, డీవోఎస్ కాలనీ, ఇందిరానగర్, ఝాన్సీనగర్, మన్నారుపోలూరులో గణనాథులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనగర్ కాలనీలో చిన్నారులకు సైకిలింగ్, పరుగు పందేలు, మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అలాగే రాగెన్న పట్టెడ గ్రామానికి చెందిన యువకులు కోలాటం ఆడారు.



సూళ్లూరుపేట : బాపూజీ వీధిలో మొక్కజొన్న కంకుల వినాయకుడు



సూళ్లూరుపేట : శ్రీనగర్ కాలనీలోని గణనాథుడు

■ పెళ్లకూరు మండలంలో వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెలబల్లిలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి, చెంబేడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటరత్నం, చిల్లకూరులో సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. కలవకూరు, పుల్లూరు, శిరసనంబేడు, ముమ్మారెడ్డిగుంట, చిల్లకూరు, పునబాక తదితర గ్రామాల్లోని యువత ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

■ చిల్లకూరు మండలంలో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. చిల్లకూరులోని కోకోలు గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం ఆకట్టుకుంది. వరగలి గ్రామంలో ఆదివారం ఉట్టి కొట్టే సంబరాలు జరుపుకున్నారు.



సైదాపురంలో కొలువైన వినాయకుడు



దక్కిలిలో..

■ గూడూరు రూరల్ ప్రాంతంలోని మోదుగవనంలో ఉన్న అడవిలో ఉన్న వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు.



నాయుడుపేట టౌన్ : ఉట్టికొడుతూ యువకుల కోలాహలం



కోట : తిమ్మనాయుడుపాలెంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



పెళ్లకూరు : పుల్లూరులో ఉట్టి కొడుతున్న యువకులు



సూళ్లూరుపేట : శ్రీనగర్ కాలనీలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



చిల్లకూరు : వరగలిలో ఉట్టికొట్టి విజేతలుగా నిలిచిన యువకులు

భక్తులతో కిక్కిరిసిన తూపిలిపాళెం బీచ్

- కోలాహలంగా మారిన సముద్ర తీరం
- 120 వినాయకుడి విగ్రహాలు నిమజ్జనం
- హాజరైన 20 వేల మంది భక్తులు
- పర్యవేక్షించిన గూడూరు సబ్ కలెక్టర్

వాకాడు : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ జిల్లాల నుంచి భక్తులు వివిధ వాహనాలపై వినాయకుని విగ్రహాలను తీసుకుని తొలిరోజు ఆదివారం తూపిలిపాళెం బీచ్‌కు చేరుకున్నారు. ఈ సారి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలతోపాటు తమిళనాడు సరిహద్దు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తూపిలిపాళెం బీచ్‌కు రావడంతో సముద్ర తీరం కిటకిటలాడింది. యువకులు వాహనాలపై నృత్యాలు చేస్తూ తూపిలిపాళెం చేరుకున్నారు. 120 విగ్రహాలను నిమజ్జనం చేశారు. 20 వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. నిమజ్జన వేడుకలను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, గూడూరు డీఎస్పీ రమణ కుమార్, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ నాగబాబు పర్యవేక్షించారు. వాకాడు, కోట, చిట్టమూరు పోలీసులు భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సముద్రం వద్ద గణనాథునికి పూజలు చేసి కేరింతలు కొడుతూ ఉత్సాహంగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే మహిళలు, పెద్దలు, చిన్నారులు, యువకులు తీరంలో ఒకరుపై ఒకరు రంగులు చల్లుకుని ఆట, పాటలతో భక్తి స్నానాలు ఆచరించారు. గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను యువకులు ఊరేగింపుగా మేళతాళాలతో నృత్యాలు చేస్తూ వెళ్లడం కనిపించింది. ఎన్నడూలేని విధంగా ఈ సారి భక్తులు ఒక్క సారిగా సముద్రతీరాన పోటెత్తారు.



సముద్రంలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



సముద్ర తీరంలో భక్తజనం కోలాహలం



నిమజ్జనాల పర్యవేక్షణలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌ను కలిసిన చిల్లకూరు తహసీల్దార్

చిల్లకూరు : గూడూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాఘవేంద్ర మీనాను శనివారం చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. చిల్లకూరు మండలంలో ఏర్పాటు చేయనున్న క్రిస్ సిటీ వివరాలను వివరించారు. అదేవిధంగా సబ్‌కలెక్టర్‌ను గూడూరు డివిజన్ వీఆర్వోల సంఘం నాయకులు కలిశారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘం డివిజన్ అధ్యక్షులు గిద్దలూరు రమణయ్య ,ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లురాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, రాధాక్రిష్ణ, పుల్లయ్య, హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖనిజం తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం దేవర తిప్ప వద్ద ఉన్న విలువైన ఖనిజాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ట్రాక్టర్‌ను సోమవారం జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఖనిజం, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దక్కిలి వెలుగులో ఏడుగురు సిబ్బంది సస్పెన్షన్

- రూ.కోటికి పైగా నిధులు స్వాహా చేసినట్టు ఆరోపణలు
- విచారణ చేపట్టిన అధికారులు
- 11 మంది సిబ్బంది చేతివాటం చూపినట్టు నిర్ధారణ
- గతంలో నలుగురిపై చర్యలు
- నిధులు రికవరీ చేయాలని కలెక్టర్ ఆదేశం

దక్కిలి: దక్కిలి వెలుగు మండల సమాఖ్యలో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. పేదల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రుణాల నిధులను దారి మళ్లించి స్వాహా చేసినట్టు విచారణలో తేలడంతో ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ జిల్లా డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి ఈనెల 6వ తేదీన ఏడుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దక్కిలి వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో అవినీతి జరిగిందని, రుణాల వివరాలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు సమాచార హక్కు చట్టం కింద గతంలో అర్జీ ఇచ్చారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో డీఆర్‌డీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సమగ్ర దర్యాప్తు చేయాలని తిరుపతి డీఆర్‌డీఏ పీడీ అధికారులను ఆదేశించారు. ఈమేరకు దక్కిలి మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో పలు బృందాలు విచారణ చేపట్టి వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో పనిచేస్తున్న 11 మంది సిబ్బంది రూ.1,32,0362లను స్వాహా చేసినట్టు గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. విచారణ జరుగుతున్న సమయంలోనే కొంతమంది సిబ్బంది నుంచి రూ.26,35,224 రికవరీ చేశారు. రూ.1,05,68,407 రికవరీ కావాల్సి ఉంది. గతంలో దక్కిలి వెలుగు కార్యాలయంలో పని చేసిన కె.వజ్రమ్మ, ఆర్.విజయమ్మ, టి.నాగూరమ్మ, ఎ.సురేఖను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఏపీఎం పోలమ్మ, సీసీలు ఎం.వెంకటేశ్వర్లు, కె.రత్నయ్య, పి.వెంకటరమణమ్మ, కె.మంజుల, వై.ఆదిలక్ష్మి, జి.సునీలాను సస్పెండ్ చేస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఇన్‌చార్జి ఏరియా కోఆర్డినేటర్ ఆదినారాయణ మాట్లాడుతూ దక్కిలి వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న ఏడుగురు సిబ్బందిపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్టు తెలిపారు. అలాగే స్వాహా చేసిన నిధులను రికవరీ చేయనున్నట్టు తెలిపారు.

కండలేరులో 9.359 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 9.359 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశ యం నుంచి కండలేరుకు 1850 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్య సాయిగంగ కాలువకు 200, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.



శాంతి హోమం నిర్వహిస్తున్నఅర్చకులు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

లక్ష్మీనరసింహుడికి చందనాలంకరణ

మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం చందనాలంకరణ చేశారు. ఆదివారం స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో మూల మూర్తికి చందనంతో అలంకరించడం ఆచారమని ప్రధానార్చకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం అభిషేకం, చందన అలంకరణ, 9 గంటలకు శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం చేపట్టినట్టు వివరించారు. సాయంత్రం శ్రీవారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. -రాపూరు